తాండూరు ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా రతన్‌సింగ్



తాండూరురూరల్, మార్చి 6, (ఆంధ్రజ్యోతి): తాండూరు ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా రతన్‌సింగ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శంకర్‌నాయక్ నల్గొండ జిల్లా దేవరకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెద్దేముల్ మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న రతన్‌సింగ్ ఇన్‌చార్జి డీఎల్పీవోగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనను తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్, ఈసీ మధుసూదనరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రతన్‌సింగ్‌ను సన్మానించారు.



ఘట్‌కేసర్ గురుకులాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

హైస్కూల్ తరలింపుపై క్షేత్ర పరిశీలన

ఘట్‌కేసర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ గురుకుల పాఠశాలకు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తరలించాలనే విజ్ఞప్తితో గురువారం మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే విద్యాలయాల రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి గురుకుల పాఠశాలను, ఘట్‌కేసర్ బస్‌స్టాండ్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు. ఘట్‌కేసర్‌లోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలను గురుకులానికి తరలించాలని కలెక్టర్‌కు వినతులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, ఇమ్మ పాల్గొన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. మార్చి నెలలోనే భానుడు నిప్పులు కక్కుతుండటంతో నీటి మట్టాలు ఒక్కసారిగా పడిపోయాయి. యాసంగి సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతోపాటు నీటి వినియోగం పెరిగిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒక్క నెలలో అత్యధికంగా సరూర్‌నగర్ మండలంలో 4.02 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోవడం గమనార్హం. వేసవిలో సాగు నీరేమో గానీ తాగు నీరు కూడా దొరకడం కష్టమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



పాతాళానికి భూగర్భజలాలు

మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి

సరూర్‌నగర్‌లో అత్యధికంగా 18.33 మీటర్ల లోతులోకి

మేడ్చల్ జిల్లాలో ఒక్క నెలలో 2.11 మీటర్లు తగ్గిన నీటిమట్టం

యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం

తాగు నీటికీ తప్పని కష్టాలు

భూగర్భజలాల పరిస్థితి (మీటర్లలో..)

జిల్లా	జనవరి	ఫిబ్రవరి	వ్యత్యాసం
రంగారెడ్డి	10.13	11.22	-1.09
మేడ్చల్	11.21	13.32	-2.11
వికారాబాద్	12.29	13.67	-1.38

వేగంగా తగ్గుతున్న నీటిమట్టాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఈ వేసవిలో ఉమ్మడి జిల్లా నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ భూగర్భజలాలు గణనీయంగా పడిపోతుండడమే ఇందుకు కారణం. యాసంగి సీజన్‌లో దాదాపు 40శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో పాటు విచ్చలవిడి నీటి వినియోగం కారణంగా శరవేగంగా నీటి నిల్వలు పడిపోతున్నాయి. జనవరి నెలాఖరుతో పోలిస్తే ఫిబ్రవరి నెలాఖరు నాటికి మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 2.11 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో 1.38 మీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 1.09 మీటర్ల వరకు భూగర్భజలాలు తగ్గాయి. గడిచిన మూడు నెలలుగా గణనీయంగా భూగర్భనీటి మట్టాలు పడిపోతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఏడాది మార్చి ఆరంభంలోనే

మిగతా 7వ పేజీలో...

ఒక్కనెలలో నాలుగు మీటర్ల లోతుకు

గత జనవరి నెలతో పోలిస్తే జిల్లాలోని 27 మండలాల్లో భూగర్భజలాలు పడిపోయాయి. ఒక్క నెలలో అత్యధికంగా సరూర్‌నగర్ మండలంలో 4.02 మీటర్ల భూగర్భజలాలు పడిపోవడం గమనార్హం. అలాగే మంచాల మండలంలో 1.87 మీటర్లు, కొందుర్గు మండలంలో 1.60 మీటర్లు, శంకరపల్లిలో 1.54 మీటర్లు నీటి మట్టాలు తగ్గాయి. సరూర్‌నగర్ మండలం బహదూర్‌గూడలో 35.79మీటర్ల లోతుకు భూగర్భజలాలు పతనమయ్యాయి.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ముమ్మర తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సదుపాయాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి ఉమా గౌరి పర్యవేక్షణలో గురువారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేపట్టాయి. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో పీసీపీఎన్‌డీటీ చట్టానికి అనుగుణంగా సదుపాయాలు, రికార్డుల నిర్వహణ, ఫామ్-ఎఫ్ ఎంట్రీలు, స్కాన్ నివేదికలు, పేషెంట్ అనుమతి పత్రాలు ఉన్నాయా, లేదా పరిశీలించారు. అల్ట్రాసౌండ్ యంత్రాల వినియోగం, సిబ్బంది అర్హతలు, గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఆరా తీశారు. తనిఖీల్లో భాగంగా సీ సెక్షన్ ఆడిట్లు, ప్రసవాల్లో సిజేరియన్ డెలివరీల సంఖ్య, కారణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి మాట్లాడుతూ ఈ తనిఖీలు జిల్లాలోని అన్ని ప్రైవేటు వైద్య కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో వైద్యులు సత్యవతి, గీత, చంద్రకళ, వినోద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్పెషల్ డ్రైవ్



క్షేత్ర పరిశీలనలో స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారులు

తాండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో భాగంగా రాష్ట్ర స్వచ్ఛ సర్వేక్షణ్ నియమించిన క్షేత్ర పరిశీలన బృందం క్షేత్ర పరిశీలన చేపట్టింది. గురువారం తాండూరు పట్టణంలోని పలు కాలనీల్లో నలుగురు సభ్యులతో కూడిన బృందం పర్యటించింది. పట్టణంలో పారిశుధ్య పనులు ఎలా కొనసాగుతున్నాయి, ఇంటింటా చెత్త సేకరణ జరుగుతుందా, చెత్త బుట్టలు ఇచ్చారా, తడి, పొడి చెత్త వేరుగా ఇస్తున్నారా, లేదా? అన్న అంశాలపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారంపాటు అధికారులు పలు అంశాలపై పట్టణంలో పర్యటించి వివరాలు సేకరించనున్నారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్ ద్వారా నివేదికను రాష్ట్ర అధికారులకు పంపిస్తున్నారు. అధికారుల వెంట ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రవీణ్‌గౌడ్, జవాన్లు ఉన్నారు.

గిరిజన రైతుల హర్షం!

ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణకు బ్రేక్

టపాసులు కాల్చి.. మిఠాయిలు పంచుకున్న రైతులు

అన్ని ప్రొసీడింగ్‌లపై హైకోర్టు స్టే

ప్రభుత్వానికి సవాల్‌గా మారిన భూసేకరణ

వికారాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/దుద్యాల: కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ ప్రక్రియకు హైకోర్టు స్టేతో బ్రేక్ పడింది. తుది తీర్పు వెలువడే వరకు ముందుకు సాగే అవకాశం లేదు. భూసేకరణ నోటిఫికేషన్లకు సంబంధించిన అన్ని ప్రొసీడింగులపై గురువారం హైకోర్టు స్టే విధించింది. దీంతో హకీంపేట్, రోటిబండ తండా, లగచర్ల, పులిచర్లకుంట తండాకు చెందిన రైతులు గురువారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి.. ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. రైతుల ఇష్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం భూసేకరణ చేపట్టినా రైతులకు కోర్టులే న్యాయం చేశాయన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ గోబ్యాక్.. రైతుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా లగచర్ల, పోలేపల్లి, హకీంపేట రైతుల గోడు పట్టించుకుని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



రోటిబండ తండాలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న రైతులు

ఇటీవల పోలేపల్లిలో పనులు ప్రారంభం

భూములు కోల్పోయే నిర్వాసితులకు ఎకరాకు రూ20 లక్షల పరిహారంతో పాటు డీటీసీపీ లేఔట్‌లో 150 గజాల నివాస స్థలం, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రకటించారు. పోలేపల్లిలో స్వాధీనం చేసుకున్న భూములను జేసీబీలతో చదును చేసే పనులు ఇటీవలనే ప్రారంభమయ్యాయి. హకీంపేట్ పరిధిలో 351.10 ఎకరాలు,

మిగతా 8వ పేజీలో...

1,177.35 ఎకరాల సేకరణకు

హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం మొత్తం 1,177.35 ఎకరాలు సేకరించేందుకు గతేడాది నవంబర్ నెలాఖరులో ప్రభుత్వం వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. భూసేకరణ విషయమై రైతులతో ఏర్పాటు చేసిన సమావేశం దారి తప్పి రణరంగంగా మారింది. కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారిపై దాడి చేసిన ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం విదితమే. మొదట అసైన్డ్ భూములను సేకరించిన తర్వాత పట్టా భూముల సేకరణకు వెళ్లాలని యంత్రాంగం నిర్ణయించింది.



ఎమ్మెల్సీల విజయంతో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం

మేడ్చల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీగా కొమరయ్యలు విజయం సాధించటంతో గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కాషాయ నేతలు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజావ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం కావటంతో ప్రజలు తమ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలు తమ పార్టీకి రావడం ప్రజల్లో తమ పార్టీకి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, జిల్లా నాయకుడు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు రవీందర్‌గౌడ్, అర్జున్, వెంకటేష్, నవీన్, అమరం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా సెకండియర్

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

మేడ్చల్‌లో 977 మంది.. వికారాబాద్‌లో 113 మంది విద్యార్థుల గైర్హాజరు

మేడ్చల్/వికారాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో అధికారులు 150 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధనలో మార్పు చేసి ఐదు నిమిషాలు వెసులుబాటు కల్పించడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల కోసం కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు జనరల్ 62,886, ఒకేషనల్ 1,060 మొత్తం 63,946 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా అందులో జనరల్ 61,941, ఒకేషనల్ 1,028 మొత్తం 62,969 మంది హాజరయ్యారు. జనరల్ 945, ఒకేషనల్ 32 మొత్తం 977 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోలేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు.

వికారాబాద్ జిల్లాలో..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలో 6931 మంది విద్యార్థులకు 6818 మంది హాజరు కాగా, 113 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5725 మంది విద్యార్థులకు 5650 మంది హాజరు కాగా, 75 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1206 మంది విద్యార్థులకు 1168 మంది హాజరు కాగా, 38 మంది గైర్హాజరయ్యారు.



మోమిన్‌పేట్‌లో పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థినులు

ద్వితీయ సంవత్సరం తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ భీమ్‌కుమార్ ఉన్నారు.



వికారాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



కీసర అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. గురువారం రాత్రి కీసరలోని పెద్దమ్మ చెరువు ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపు పెద్దఎత్తున చెలరేగిన అగ్నిజ్వాలలు వాతావరణం చల్లగా ఉండటంతో చల్లారిపోయాయి.

కీసర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)

కొడంగల్ సమగ్రాభివృద్ధికి కృషి

కొడంగల్/దౌల్తాబాద్/బొంరాస్‌పేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, మద్దూర్ మండలాల పరిధిలో పలు అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. కొడంగల్ మండలంలోని చిట్లపల్లి, అంగడిరైచూర్, ఇందనూర్, రావుల్‌పల్లితోపాటు దౌల్తాబాద్ నుంచి రావుల్‌పల్లి, మద్దూర్, దౌల్తాబాద్-కోస్గి నాలుగు లేన్ల బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో జరిగిన పలు శుభకార్యాల్లో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. కొడంగల్ పట్టణ శివారులోని కోస్గి రోడ్డులో నూతన రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించారు. బొంరాస్‌పేట్ మండలంలోని బాపల్లితండాలో నూతన సీఎస్‌సీ సెంటర్‌ను తిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, వెంకట్రావ్, నర్సింహులుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్ గుప్త, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాములు, నర్సింహులు, సేవ్యానాయక్, వెంకట్రాములు, నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లేశ్, రాంరెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు



మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల్లో యూనిట్ల ఏర్పాటు

రూ.3 కోట్లతో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం

యూనిట్‌కు ఐదెకరాలు గుర్తింపు

7

పరిగి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పరిగి ఎంపీడీవో ఎంఏ కరీం అన్నారు. సాలిప్పలిబాటతండాలో గురువారం ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు మస్టర్‌ను తనిఖీ చేశారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

అనంతరం కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉండి పని అడిగిన ప్రతీ కూలీకి పనికల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలి అడిగిన ప్రతీ వ్యక్తికి పనికల్పించాలని సూచించారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ ప్రభాకర్‌గౌడ్, ఎఫ్‌ఏ ఎల్లప్ప పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్


ఇంటి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, సిబ్బంది

ఘట్‌కేసర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్లకు అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 12,500 ఇళ్లు ఉన్నాయి. పాత బకాయిలు రూ.3.64కోట్లు, ప్రస్తుత మొత్తం 9.71కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది ట్యాక్స్ వసూళ్లపై దృష్టి కేంద్రీకరించారు. మొండి బకాయిదారులు ట్యాక్సులు చెల్లించని వారి ఇళ్ల డ్రైనేజీలను, నల్లా కనెక్షన్లను తొలగిస్తున్నారు. దీంతో చాలామంది పన్నులు చెల్లిస్తున్నారు. ఘట్‌కేసర్‌లో ఇప్పటి వరకు 45.41శాతం పన్నులు వసూలు చేశారు. స్పెషల్ డ్రైవ్ కొనసాగనుంది.

నైపుణ్యాల వెలికితీతకు సైన్స్ ఫెయిర్ దోహదం


ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట్, మార్చి6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదపడుతాయని ప్రధానోపాధ్యాయుడు అశోక్ అన్నారు. గురువారం కోల్కుంద జెడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్ ఫెయిర్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వారిని టీచర్లు అభినందించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

విద్యార్థినులను ఇబ్బందిపెట్టొద్దు


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేయొద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. బాలికలు, ఉపాధ్యాయినుతో మాట్లాడారు. బాలికలకు ఎలుకలు కరిచిన విషయంపై ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గీతరాథోడ్‌సింగ్, ప్యాక్స్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు ఖదీర్, నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కడ్తాలతో అంబలి కేంద్రం ఏర్పాటు


బాటసారులకు అంబలి పంపిణీ చేస్తున్న బిక్యానాయక్

కడ్తాల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ అన్నారు. కడ్తాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాగి అంబలి కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్‌లతో కలిసి బాటసారులు, ప్రయాణికులకు అంబలిని పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, దాతలు ముందుకురావాలని కోరారు. కడ్తాలలో యేటా అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌ను ఆయన అభినందించారు. రాంచందర్, జహంగీర్, కృష్ణ పాల్గొన్నారు.

నకిలీ మందు విక్రయంపై రైతు ఫిర్యాదు


పైరును పరిశీలిస్తున్న ఏవో శిరీష, ఏఈఓలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని లేమామిడికి చెందిన రైతు శ్రీధర్‌రెడ్డి తన సాగు చేస్తున్న మొక్కజొన్న పైరులో కలుపు మందు పిచికారి చేశాడు. అయితే మందు ప్రభావంతో పంట మొక్కలు ఎండుతున్నాయని రైతు మండల వ్యవసాధికారి(ఏవో) శిరీషకు గురువారం ఫిర్యాదు చేశాడు. తాను కేశంపేటలోని గ్రోమోర్ సెంటర్ నుంచి కలుపుమందు తెచ్చి మందు స్ప్రే చేశానని తెలిపాడు. స్ప్రే చేసిన తరువాత మొక్కజొన్న పైరు ఎండిపోతోందన్నాడు. స్పందించిన ఎంఏవో.. ఏఈవోలు సుధ, నిఖిల్‌లతో మొక్కజొన్న చేనును పరిశీలించారు. పంట ఎండిపోతోందని, అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు వొచ్చి పరిశీలించిన తరువాతే పంట చనిపోవడానికి గల కారణాలను నిర్ధారిస్తారని తెలిపారు. చేను వద్దకు శాస్త్రవేత్తలను రప్పించేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాస్తానన్నారు. వారి వెంట పాండురంగారెడ్డి ఉన్నారు.

పురాతన ఆలయాలను పునరుద్ధరిస్తాం

తలకొండపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని పురాతన ఆలయాలను పునరుద్ధరించి పునర్వైభవాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆలయాలు, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా నియోజకవర్గానికి రూ.5కోట్లు మంజూరు చేసిందన్నారు. పడకల్ గ్రామ నాయకులతో గురువారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ నెల 13 నుంచి 20 వరకు కొనసాగే పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు ఎమ్మెల్యేకు అందజేశారు. దైవ కార్యక్రమాల్లో ప్రతొక్కరూ పాలుపంచుకోవాలని కసిరెడ్డి అన్నారు. నాయకులు శంకర్, భిక్షపతి, మల్లేశ్, కుమార్ పాల్గొన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు తల్లోజు ఆచారి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల వెంకటేశ్‌లకు ఆహ్వానాలను అందజేశారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు



కల్యాణతంతు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం

రంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలం బైర్ఖాన్‌పల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనారసింహుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. పండితులు నరసింహ శర్మ, చిదంబరంశర్మ, వెంకటదత్తశర్మ, రామశర్మ, దత్తాత్రేయశర్మ, విశ్వశర్మ కల్యాణ తంతు జరిపించారు. అంతకు ముందు స్వామి వారల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మండపానికి తీసొచ్చారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాఘవేందర్‌రావు, రూప్లానాయక్, కృష్ణయ్య, నాయకులు అంజయ్య, వెంకటయ్య, యాదగిరిరావు, యాదగిరి, కుమార్, ద్రోణాచారి, యాదగిరిచారి, పరుషోత్తమచారి, జగదీశ్వరచారి, భక్తులు పాల్గొన్నారు.

మాలలను దోషులుగా చిత్రీకరించొద్దు



చేవెళ్లలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాలలను ద్రోహులుగా, దోషులుగా చిత్రీకరించటం సరికాదని రంగారెడ్డి జిల్లా మాల సంఘాల జేఏసీ నాయకుడు, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశ్, మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. గురువారం చేవెళ్లలో జిల్లా మాల సంఘాల జేఏసీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ త్యాగాలు, పోరాటాల ద్వారా వచ్చిన రిజర్వేషన్లను అందిపుచ్చుకోవడమే తప్పు చేసినట్లుగా ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో చేసిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 18శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మాలల్లోని మేధావులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు మాలల అస్తిత్వానికి పోరాడాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెపల్లి శ్రీనివాస్, సత్యం, బురాన్ మహేశ్, బేగరి సంజీవ, తదితరులు ఉన్నారు.

చౌడాపూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శరభలింగం

చౌడాపూర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ గ్రామానికి చెందిన శరభలింగం డాక్టరేట్ అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట్ పీహెచ్‌సీలో హెల్త్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శరభలింగం సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు అవార్డులు అందుకున్నారు. గురువారం ప్రపంచ సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణ కమిషన్ న్యూఢిల్లీ వారు గౌరవ డాక్టరేట్ అందించారు. కరోనా కాలంలో ప్రజలను చైతన్యపర్చడం, యువజన సంఘాలతో యువతలో చైతన్యం కల్గించడం, మూఢనమ్మకాలను నిర్మూలించడం తదితరాంశాలపై చైతన్యపర్చారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడంపై శరభలింగం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ది ఎర్త్ సెంటర్‌లో కన్పించిన పాలరాతి కప్ప



కడ్తాల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్మాస్‌పల్లిలో గల 'ది ఎర్త్ సెంటర్' జీవవైవిధ్యానికి నిలయంగా మారింది. అరుదైన జీవులు, మొక్కలు ఇక్కడ ప్రసిద్ధి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు జీవరాసుల ఉనికికి తోడ్పడుతున్నాయి. గురువారం ఎర్త్ సెంటర్‌లో పాలరాతి బుడగల కప్ప కన్పించింది. కప్ప జాతిలో ఇది అరుదైందని సీజీఆర్ ప్రతినిధి, జంతుశాస్త్ర విద్యార్థి జ్ఞానేశ్వర్ తెలిపారు. వేసవిలో నెలపాటు భూ అంతర్భాగంలో సుప్తావస్థలో ఈ కప్ప ఉంటుందని చెప్పారు. ఎర్త్ సెంటర్‌లో అరుదైన కప్ప కన్పించడంపై సీజీఆర్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పాతాళానికి భూగర్భజలాలు

(ఐదో పేజీ తరువాయి)

ఎండలు దారెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ముఖ్యంగా నగర శివార్లలో భూగర్భ జలాలు అధఃపాతాళానికి పడిపోయాయి. సాగునీటి సంగతి ఏమోకానీ తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తున్నాయి. సరూర్‌నగర్ మండలంలో అత్యధికంగా 18.33 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. అలాగే 23శాతం ప్రాంతాల్లో 15 మీటర్లలోతుకు సగటు భూగర్భజలాలు అడుగంటాయి. నవంబర్ నుంచి దాదాపు ప్రతినెలా సగటు మీటర్‌కుపైగా భూగర్భజలాలు తరిగిపోతున్నాయి. ఫిబ్రవరిలో మరింత శరవేగంగా భూగర్భజలాలు తరిగిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దాదాపు యాసంగి సీజన్ ముగియడంతో భవిష్యత్‌లో వర్షాలు పడే అవకాశం లేదు. దీంతో తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో భూగర్భనీటి నిల్వలు శరవేగంగా పడిపోతున్నాయి. శివార్లలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజలు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నారు. మరో వైపు నీటి ఎద్దడి కారణంగా యాసంగి పంటలకు ఇబ్బందులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాసంగి సీజన్‌లో వర్షాలు లేకపోవడం వల్ల పంటల సాగుపై ప్రభావం పడింది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో వానాకాలం 30శాతానికిపైగా అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే తరువాత మూడు జిల్లాల్లో యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు లోటు వర్షపాతంతో పాటు మరోవైపు విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటున 128.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 77.5మి.మీ వర్షపాతమే నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 129.6 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 80.3మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో 104.9మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 94మి.మీ వర్షం పడింది. దీంతో పంటపొలాలకు బోర్ల ద్వారా నీటి వాడకం గణనీయంగా పెరిగింది. కొన్నిచోట్ల ఇప్పుడే బోర్లు ఎండిపోతున్నాయి. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరూర్‌నగర్‌లో అత్యధికంగా ...

ఉమ్మడి జిల్లాలో సరూర్‌నగర్ మండలంలో అత్యధికంగా భూగర్భజలాలు పడిపోయాయి. ఇక్కడ సగటు 18.33 మీటర్ల లోతుకు భూగర్భజలాలు అడుగంటాయి. అలాగే ఇబ్రహీంపట్నం మండలంలో 16.89 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. శేరిలింగంపల్లి మండలంలో 15.07 మీటర్లు, మంచాల 13.83 మీటర్లు, తలకొండపల్లి మండలంలో 13.52 మీటర్లు, హయత్‌నగర్ మండలంలో 13.07 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పతనమయ్యాయి.

మహిళా సంఘాలకు ...
సోలార్ ప్లాంట్లు

- బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల్లో యూనిట్ల ఏర్పాటు
- రూ.3కోట్లతో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం
- యూనిట్‌కు ఐదెకరాలు గుర్తింపు
- పీఎం-కుసుమ్ స్కీం కింద ప్లాంట్ల శ్రీకారానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత



సౌర విద్యుత్ ప్లాంట్ నమూనా

బషీరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు వారు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌గా వికారాబాద్ జిల్లా బషీరాబాద్, కోట్‌పల్లి మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. బషీరాబాద్ మండలం ఆమర్చెడ్ వద్ద 11కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు అప్పగించారు. కోట్‌పల్లి మండలం బర్వాద్‌లోనూ స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఈ భూములను డీపీఎం రాంమూర్తి, సోలార్ ప్రాజెక్ట్ మెనేజర్లు, సర్వేయర్లు పరిశీలించి డీపీఆర్‌ను అందజేశారు.



దామర్‌చెడ్ వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీఎం కుసుమ్ స్కీంతో ముందుకు

థర్మల్ విద్యుదుత్పత్తిని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్లను ప్రోత్సహిస్తోంది. ఇందుకు 'పీఎం కుసుమ్' పథకాన్ని తెచ్చింది. మహిళా సంఘాలకు ఆదాయమార్గాన్ని చూపేందుకు ప్రభుత్వం సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఊతమిస్తోంది. ప్రభుత్వ మహిళా సంఘాలతో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించి, నిర్వహణ బాధ్యతలను సమీప రెండు గ్రామాల సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో రెండు యూనిట్లు

రాష్ట్రంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లు నెలకొల్పాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) బషీరాబాద్, కోట్‌పల్లిల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపిక చేసింది. ఈ మండలాల్లో ఒక్కో మెగావాట్ సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్లాంట్‌కు 4 నుంచి 5ఎకరాల స్థలం అవసరం. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్‌కు 5కిలోమీటర్లలోపు ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. వీటి నిర్వహణా బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించేందుకు డీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.3కోట్ల అవుతుందని, ఇందులో 90శాతం బ్యాంక్ రుణం ఇస్తుందని, 10శాతం నిధులను మహిళా సంఘాలు తమ వాటాగా సమకూర్చుకుంటారని అధికారులు చెబుతున్నారు. భూమిని 25ఏళ్ల కాలపరిమితితో ప్రభుత్వం ఉచితంగా కేటాయిస్తుంది. ఈ క్రమంలో 15ఏళ్లలో నిర్మాణ వ్యయం చేతికంది, పదేళ్ల మహిళా సంఘాలకు ఆదాయం సమకూరుతుంది. సోలార్ ప్లాంట్ల విద్యుత్‌ను డిస్కంలకు విక్రయిస్తారు. తక్కువ వ్యయం, సులభ నిర్వహణ అయ్యే సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పి మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

యూనిట్ల ఏర్పాటుకు సంయుక్త సర్వే

ప్రభుత్వ భూములను సర్వేచేసి నివేదికిచ్చిన తర్వాత యూనిట్ల ఏర్పాటులో సాంకేతిక సమస్యలు రాకుండా ప్రభుత్వం సంయుక్త సర్వేకు ఆదేశాలు జారీ చేయనుంది. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ట్రాన్స్‌కో అధికారులు, రెవెన్యూ అధికారులు వీలైతే టీఎస్ రెడ్కో అధికారులు సంయుక్త పరిశీలన సర్వే చేసి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశించింది.

ప్లాంట్ ఏర్పాటుకు స్థలం గుర్తించాం



పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌తో కలిసి దామర్‌చెడ్ వద్ద స్థలాన్ని ఎంపిక చేశాం. స్థల పరిశీలనానంతరం డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపారు. అనుమతులొచ్చాక ప్లాంట్ నిర్మాణం ప్రారంభం అవుతుంది.

పద్మారావు, ఐకేపీ ఏపీఎం, బషీరాబాద్



కేంద్ర మంత్రి పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ రాజేందర్

మురుగు నీటి నిర్వహణకు నిధులు కేటాయించండి

మేడ్చల్ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో మురుగు నీటి నిర్వహణకు రూ.133కోట్లు విడుదల చేయాలని కోరుతూ ఎంపీ ఈటల నివేదిక సమర్పించారు. తన నియోజకవర్గంలో ఉన్న మూసీ మురుగు నీటి శుద్ధి, పలు ప్రాంతాల్లో కలుషితమైతున్న జల వనరుల సంరక్షణకు నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం చాలా భాగం హైదరాబాద్‌లోనే ఉన్నందున స్థానికంగా మురుగునీటి సమస్య, కొన్ని ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎంపీ ఈటల కేంద్రమంత్రికి వివరించారు. లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చేపట్టాల్సిన పనులపై వివరాలను సమర్పించారు. ఎంపీ వినతిపై కేంద్రం మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాలయకులు తెలిపారు.

కంది పంట దగ్ధం

- బూడిదైన మూడున్నర ఎకరాల చేను
- రైతుకు రూ.1.5లక్షల మేర నష్టం



బూడిదైన కంది పంట

షాద్‌నగర్ రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశత్తు కంది పంటకు నిప్పంటుకొని మూడున్నర ఎకరాల మేర పంట కాలి బూడిదైంది. వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడకు చెందిన పాపయ్యయాదవ్ తన మూడున్నర ఎకరాల్లో కంది సాగు చేశాడు. కోతకు రావడంతో గురువారం ఇద్దరు కూలీలు పంట కోస్తున్నారు. కూలీలు ఓ పక్క పంట కోస్తుండగా పక్క పొలం రైతు తన పొలంలో చెత్తను కాల్చేందుకు నిప్పుపెట్టాడు. అతడి నిర్లక్ష్యంతో మంటలు పక్క పొలంలోని కంది చేనుకు వ్యపించాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు పంటంతా వ్యాపించాయి. రైతులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఎండకు ఎగిసి పడ్డాయి. కంది చేను మొత్తం కాలి బూడిదైంది. పంట దగ్ధంతో తనకు రూ.1.5లక్షల నష్టం వాటిల్లిందని రైతు పాపయ్య తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



దగ్ధమవుతున్న కంది చేను

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

ఆదిభట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధి ఏవీఎన్ ఇంజినీరింగ్ కాలేజీలో రుద్రసంధాన్ 2కె25 జాతీయ స్థాయి సాంకేతిక, క్రీడా పోటీలను ప్రారంభించారు. పోటీల్లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలను వెలికితీసేందుకు 2కే వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిభ చూపే విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. కాలేజి సెక్రటరీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు 2కే వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రదర్శనలను కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ అబ్దుల్ నబీ ఏవో సుధీర్‌రెడ్డి, సురేష్, జయరాం, రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోటీల నిర్వహణ అభినందనీయం

మొయినాబాద్ రూరల్: విద్యాసంస్థల్లో క్రీడలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల శక్తిసామర్థ్యం పెంచేందుకు అవకాశం ఉంటుందని, క్రీడా పోటీలు అభినందనీయమని ప్రో కబడ్డీ టీమ్ ఆటగాడు గంగాధర్ మల్లేశ్, ఇండియా వాలీబాల్ టీమ్ ఆటగాడు జంగపన్న గౌడ్ అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీఐఈటీ కాలేజీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ క్లబ్ అధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆరంబ్-25 పేరిట రెండు రోజులు నిర్వహించే క్రీడాపోటీలను గురువారం వారు ప్రారంభించారు. క్రీడా పోటీలతో విద్యార్థుల్లో స్నేహభావం ఏర్పడుతుందని, పోటీతత్వం పెంపొందుంతుందని చెప్పారు. జేబీ విద్యాసంస్థల కార్యదర్శి జేవీ.కృష్ణారావు, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, డైరెక్టర్ సంజయ్, డీన్లు కార్తికేయన్, సలవుద్దీన్, పీడీ విగ్నేష్, సంతోష్ క్రీడాకారులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: క్రీడాకారులతో గంగాధర్ మల్లేశ్, జంగపన్నగౌడ్

బాలికలను చితకబాదిన పీఈటీ

కీసర, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆటలాడేందుకు రాలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థినులను చితకబాదిన ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో గురువారం చోటుచేసుకుంది. బాలికల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 8మంది విద్యార్థినులు డ్రిల్ పీరియెడ్‌లో ఆటలాడేందుకు పోలేదు. దీంతో పీఈటీ ఆనంద్ వారిపై కోపం పెంచుకున్నాడు. డ్రిల్ పీరియెడ్‌లో ఓ ఉపాధ్యాయిని వారింట్లో జరిగిన ఓ శుభకార్యానికి సంబంధించిన ఫొటోలను ఫోన్‌లో ఆ బాలికలకు చూపిస్తున్నారు. ఇది చూసిన ఆనంద్ కోపంతో విచక్షణ కోల్పోయి విద్యార్థినులను కర్రతో చితకబాదాడు. బాలికలకు వీపుపై వాతలు తేలాయి. దీంతో బాలికల తల్లిదండ్రులు వ్యాయామ ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ ఘటనపై హెచ్‌ఎం శశిధర్ స్పందిస్తూ.. విద్యార్థినులను పీఈటీ చితకబాదిన విషయం తన దృష్టికి రాలేదని, వివరాలు తెలుసుకుంటానని చెప్పారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు

హ్యాకథాన్‌లతో మేధాశక్తిని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని మేధాశక్తిని పెంచుకోవాలని అనురాగ్ వర్సిటీ ఐటీ విభాగం హెచ్‌వోడీ సుధీర్‌రెడ్డి అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో గురువారం బీఐ పేరుతోని నిర్వహించిన 48గంటల హ్యాకథాన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తరచూ హ్యాకథాన్‌లు, టెక్నికల్ వర్క్‌షాప్‌లు, సదస్సుల్లో పాల్గొని మేధాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొదించే వేదికలు హ్యాకథాన్‌లు అన్నారు. ఫైనాన్స్, బ్యాంకింగ్, రీటైల్, హెల్త్‌కేర్, స్పోర్ట్స్ తదితర డొమైన్ల నుంచి సమస్యా పూరణలు ఇచ్చారని, వీటిపై విద్యార్థులు మోడళ్లను అభివృద్ధి చేయాలని తెలిపారు. హ్యాకథాన్‌లో 17జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, బాలజీ ఊట్ల, విష్ణుచందన, వేణుగోపాల్, శాస్త్రి, మన్సూర్, మూర్తి, లక్ష్మి, రేణుక, విద్యార్థులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనం భూమిపై వివాదం

తాండూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పల్లెప్రకృతి వనం భూమిపై వివాదం చోటుచేసుకుంది. గోపన్‌పల్లిలో పల్లె ప్రకృతివనం కోసం ప్రభుత్వ భూమి సర్వే నంబర్-6లో అధికారులు అరఎకరం కేటాయించారు. ఈ క్రమంలో పల్లె ప్రకృతి వనానికి కేటాయించిన భూమిలో ఓ వ్యక్తి జేసీబీతో చదును చేస్తున్నాడు. ఈ విషయమై ఆ వ్యక్తిని అడుగగా ఆ భూమి తన సోదరి భూమి అని, గతంలో అధికారులు అడిగితే ఇచ్చామన్నారు. ప్రస్తుతం వాడుకలో లేకపోవడంతో సాగుకు సిద్ధం చేస్తున్నామని తెలిపాడు.

నిండా నిర్లక్ష్యం!


మైదానంలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

తాండూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసలే ఎండకాలం.. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాండూరు మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొత్త మంచి నీటి వాటర్ ట్యాంకు కు మిషన్ భగీరథ నీటిని నింపి పట్టణంలోని కాలనీలకు మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం రెండు, మూడు రోజులకు ఒక సారి మంచి నీటి సరఫరా జరుగుతోంది. అయితే ట్యాంక్‌ను ఆన్‌ఆఫ్ చేయాల్సిన మున్సిపల్ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ట్యాంక్ నిండిన తర్వాత బంద్ చేయకపోవడంతో నీరంతా ట్యాంకులో నుంచి నీరంతా మైదానంలోకి వెళ్తోంది. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్దామంటే కనీసం ఫోన్‌లోనూ స్పందించడంలేదని కాలనీ వాసులు వాపోయారు.

కంకర పరిచారు.. వదిలేశారు!

- గడ్డమీది గంగారంలో అధ్వానంగా రోడ్డు
- ఆరునెలలుగా మారని దుస్థితి
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు


కంకర పరిచి వదిలేసిన గడ్డమీది గంగారం రోడ్డు

ధారూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తారు రోడ్డు నిర్మించేందుకు పాత రోడ్డును తవ్వి, కంకర పరిచారు. ఆ తర్వాత రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని గడ్డమీది గంగారం నుంచికుక్కింద ఉన్నత పాఠశాల వరకు ఉన్న ఈ రోడ్డుపై గత ఆరు నెలలుగా ఈ పరిస్థితి నెలకొంది. ఎంఆర్ఆర్ గ్రాంట్ ద్వారా బుగ్గా నుంచి కోట్‌పల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వయా మున్నూర్‌సోమారం, గడ్డమీదిగంగారం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.82కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పనులను గతేడాది ఆగస్టులో ప్రారంభించారు. కుక్కింద ఉన్నత పాఠశాల నుంచి గడ్డమీది గంగారం గ్రామ శివారు వరకు పాత రోడ్డు తవ్వివేసి కంకర పరిచి వదిలేశారు. ఆ తర్వాత రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ఈరోడ్డుపై నిత్యం రాకపోకలు సాగించే గడ్డమీది గంగారం, నర్సాపూర్, కొండాపూర్‌కలాన్ తదితర గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే పెద్ద వాహనాలు, లోడ్ వాహనాల వల్ల విపరీతమైన దుమ్ము లేస్తోంది. రోడ్డు ఎగుడుదిగుడుగా, గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గడ్డమీది గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసును రోడ్డు బాగాలేక నిలిపివేసి, కుక్కింద ఉన్నత పాఠశాల నుంచే బస్సు నడిపిస్తున్నారు. దీంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు కోసం అక్కడి వరకు వెళ్లాల్సివస్తోందని పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను వెంటనే కొనసాగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కె.చంద్రయ్య కోరారు.


కంకర రోడ్డుపై దుమ్ము

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దేముల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన పెద్దేముల్ మండలం మారెపల్లి శివారులో గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మారెపల్లి నుంచి తండాకు వెళ్లే మార్గంలో కూర్వ దస్తాప్ప పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

గౌతాపూర్‌లో గొర్రెల చోరీ


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు

తాండూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు చోరీకి గురైన ఘటన మండలంలోని గౌతాపూర్‌లో జరిగింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జెన్నె పెద్ద రాములు గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాములు రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి గొర్రెల మందను తన ఇంటి పక్కన దొడ్డిలోకి తోలి తాళంవేసి ఇంట్లో పడుకున్నాడు. అర్ధరాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వాహనంలో వచ్చి రాములు దొడ్డిలో కట్టేసిన గొర్రెల గది తాళం పగలగొట్టి ఆరు గొర్రెలను ఎత్తుకెళ్లారు. వాహనంలో వచ్చి గొర్రెలను ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

దౌల్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గోకఫస్లాబాద్ శివారులోని న్యూమాస్టర్ మైండ్ స్కూల్ వద్ద గురువారం పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఆటోను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ ఎండీ.కతల్‌హుసేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం


కులకచర్ల: పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

పరిగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. పరిగిలోని ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్, పల్లవి జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గ్లోబల్ కళాశాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కులకచర్ల: కులకచర్లలోని వివేకానంద కళాశాలలో 180 మంది విద్యార్థులకు 10 మంది గైర్హాజరు కాగా, శ్రీ రామలింగేశ్వర కళాశాలలో 183 మంది విద్యార్థుల్లో ఒకరు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

కొడంగల్ రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు మధు, విజయలక్ష్మి తెలిపారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 243 మంది పరీక్ష రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరయ్యారు. బీ కేంద్రంలో 320 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ విజయ్ కుమార్ పరిశీలించారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 116 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరైనట్లు కళాశాల కరస్పాండెంట్ నర్సింహా తెలిపారు.


పరిగి: ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

మేడ్చల్‌లో కొత్త యూటర్న్

మేడ్చల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వాహనాల ఇబ్బందులను తొలగించటానికి గురువారం స్థానిక ట్రాఫిక్ పోలీసులు కొత్తగా యూటర్న్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాలు కిక్కిరిసి ఉంటున్నాయి. దీంతో వాహనదారులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ చౌరస్తా వద్ద, ఆర్టీసీకాలనీ వద్ద రెండు యూటర్న్‌లు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించటానికి ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గల జాతీయ రహదారిపై కొత్తగా యూటర్న్‌ను ఏర్పాటు చేశారు.


మేడ్చల్‌లో కొత్త యూటర్న్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పదవిపోయినా.. బోర్డులపై పేర్లు!


తాండూరులో స్వాగత బోర్డుపై మాజీ చైర్‌పర్సన్, మాజీ కౌన్సిలర్ పేర్లు

తాండూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో అధికారులు గత పాలకుల సేవలోనే తరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు మున్సిపాలిటీ పరిధిలో వారం రోజుల కిందట ఏర్పాటు చేసిన ఈ స్వాగత బోర్డులే నిదర్శనమని చెప్పవచ్చు. పాలకమండలి సభ్యుల పదవీకాలం ముగిసినప్పటికీ తాండూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, మాజీ కౌన్సిలర్ల పేర్లతో మున్సిపాలిటీలోని 36వార్డుల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే పదవీ కాలం ముగిసినప్పటికీ మాజీ ప్రజాప్రతినిధుల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు. ఈ బోర్డులను మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

పట్టపగలే.. విద్యుత్ వెలుగులు


అప్పాయిపల్లిలో పట్టపగలు వెలుగుతున్న విద్యుద్దీపం

కొడంగల్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాల్లో పర్యవేక్షణ కరువైంది. దీంతో పట్టపగలే విద్యుద్దీపాలు వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండలంలోని టేకుల్‌కోడ్, అన్నారం, అంగడిరైచూర్, అప్పాయిపల్లి తదితర గ్రామాల్లో నిరంతరంగా విద్యుద్దీపాలు వెలుగుతుండటంతో ప్రజాదనం వృథా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు.


తీరిన విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్య

- స్పీకర్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వేసిన స్తంభాలు, విద్యుత్‌లైన్

ధారూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శాసన సభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ చొరవతో మండలంలోని ధారూరుస్టేషన్ గ్రామంలో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీరింది. స్పీకర్ ఆదేశాలతో మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి గ్రామంలో కొత్తగా 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గురువారం సిబ్బందితో పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యవసాయ బోర్లు, గ్రామానికి కనెక్షన్ ఇవ్వటంతో ఓవర్‌లోడ్‌తో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడేది. ఈ సమస్య నివారణకు కొత్త విద్యుత్ స్తంభాలు పాతి లైన్‌వేసి ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు రాతికట్ట నిర్మించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మాజీ సర్పంచ్ తిరుపతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదయ్య, వెంకటేశ్, విజమ్, సోమ్లా తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయం పరిపాలనలో విద్యార్థులు

బొంరాస్‌పేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కెపల్లి యూపీఎస్ పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం, స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశం హెచ్ఎం నరేందర్‌గౌడ్, పరమేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్


అవినాశ్‌రెడ్డి, శృతి దంపతులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్/యాలాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి సోదరుడు ఎల్లారెడ్డి కుమారుడు అవినాశ్‌రెడ్డి, శృతిల వివాహం గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ సిరిగిరిపేట్ సాయిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, నాయకులు జనార్ధన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు సిరిగిరిపేట్ స్వరూపావెంకట్ రాంరెడ్డి, రాజప్ప, గుర్రంపల్లి మొగులప్ప, మాజీ ఎంపీటీసీలు రఘునాథ్‌రెడ్డి, రవిసింధే, కాంగ్రెస్ నాయకులు బోయిని నర్సింహులు, సురేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు. అదేవిధంగా యాలాల మండలంలోని గోవిందరావుపేట గ్రామంలో అనంతప్ప కుమారుడి వివాహం గురువారం జరిగింది. ఈ వివాహానికి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్(చిన్న), కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

షష్టిపూర్తి వేడుకలో..

యాలాల: మండలంలోని ముద్దాయిపేటలో రాజప్ప, రుద్రమణి దంపతుల వివాహ షష్టిపూర్తి వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. దంపతులకు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజప్పగుప్తా, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

పెద్దేముల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గురువారం భూమి పూజ నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి నాటికి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు సంఘం అధ్యక్షులు జనార్ధన్ 30కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామమాజీ సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, బలరాం, మోహన్‌రెడ్డి, లియఖాత్‌అలీ, జిల్లా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్‌చారి, మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, యువజన సంఘం నాయకులు సర్వేశ్వర్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు పూలకాడి రవి, మట్టపు మల్లేశం, న్యాయవాది పదాల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌పై చర్యలు తీసుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి తల్లితండ్రులు క్రాంతికుమార్, సోనాగోశ్

కీసర రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను నమ్మక ద్రోహం చేసిన ఆర్చరీ కోచ్ గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్చరీ క్రీడాకారుడు నిఖిత్‌శ్రీ తల్లితండ్రులు క్రాంతికుమార్, సోనాగోశ్‌లు డిమాండ్ చేశారు. నిఖిత్‌శ్రీకి జరిగిన అన్యాయంపై గురువారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న రిక్విల్ ఫోర్డ్ స్కూల్‌లో 3వ తరగతి చదవుతున్న తమ కుమారుడు నిఖిత్‌శ్రీకి ఆర్చరీ విద్యపై ఉన్న మక్కువతో గణేశ్ అనే వ్యక్తిని కోచ్‌గా నియమించినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలుగా విలు విద్యలో శిక్షణ ఇచ్చాడని తెలిపారు. తమ కుమారుడు విలు విద్యలో రాణిస్తూ అండర్ 10లో రజత పతకాన్ని సాధించటంతో పాటు 2021లో జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నట్లు చెప్పారు. మెరుగైన శిక్షణకు రూ.2.50లక్షలతో కావాల్సిన ఆధునాతన పరికరాలను కొనుగోలు చేశామని తెలిపారు. రెండు నెలల నుంచి నిఖిత్‌శ్రీకి శిక్షణ ఇవ్వడంలో కోచ్ గణేష్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని గమనించి, అతడిని ప్రశ్నించినట్లు తెలిపారు. అది మనసులో పెట్టుకున్న గణేష్, ఆర్చరీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ నుంచి తన పేరును తొలగింపజేసినట్లు చెప్పారు. నాటి నుంచి క్రీడా పోటీలకు సంబంధించిన సమాచారం తనకు తెలపడంలేదని వెల్లడించారు. గత ఫిబ్రవరిలో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న పోటీల విషయమై బెంగాల్‌లో ఉండే తన మిత్రుడు తెలపడంతో అసలు విషయం బయట పడిందన్నారు. జరిగిన మోసంపై ఆర్చరీ అసోసియేషన్ హెడ్ కోచ్ డాక్టర్.రవిశంకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనకపోవటంతో తమ కుమారుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కోచ్ గణేష్‌పై చర్యలు తీసుకోవటంతో పాటు, ఆర్చరీ అసోసియేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కొడంగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండిసంజయ్‌ను కొడంగల్ పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పూనంచంద్‌లాహోటీ తదితరులు కలిశారు. హైదరాబాద్‌లో బండిసంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొడంగల్ ప్రాంత సమస్యలను కేంద్రమంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బసప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన

మోమిన్‌పేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మొరంగపల్లి శివారులో గల కార్తీకేయ కంపెనీలో కార్మికులకు రోడ్డు భద్రతపై గురువారం ఏఎస్సై పుండరీకం అవగాహన కల్పించారు. కార్మికులు పని చేసే చోట తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ శివరామకృష్ణ, పాల్గొన్నారు.

గిరిజన రైతుల హర్షం!

(5వ పేజీ తరువాయి)

లగచర్ల పరిధిలో 110 ఎకరాలు సేకరించేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ శివకుమార్, గోపాల్‌నాయక్‌లు అనే రైతులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్ దాఖలు చేశారు. 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా జారీ చేసిన ఈ నోటిఫికేషన్లను రద్దు చేయాలని, అప్పటి వరకు నోటిఫికేషన్‌పై స్టే విధించాలని పిటిషన్‌దారులు న్యాయస్థానాన్ని కోరడంతో విచారణ జరిపిన హైకోర్టు భూసేకరణకు సంబంధించిన అన్ని పోసీడింగులపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారుల తీరుపై విమర్శలు

భూసేకరణ ప్రక్రియలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తగిన జాగ్రత్తలను తీసుకోకుండా దూకుడుగా వెళ్లడం వల్లనే న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్లను రద్దు చేసి.. ఆ వెంటనే రెండు రోజుల వ్యవధిలోనే ఆ గ్రామాల పరిధిలోనే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించకుండా, నిపుణులతో సామాజిక ప్రభావం మదింపు చేపట్టకుండా అత్యవసరంగా భూసేకరణ చేపడుతున్నారనే విషయాన్ని పిటిషన్‌దారులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లగచర్ల ఘటన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికార పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించిందనే చర్చసాగుతోంది. లగచర్ల ఘటన తర్వాతకూడా జాగ్రత్తలు తీసుకోకుండానే అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తంగా..

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొడంగల్ రూరల్: హస్నాబాద్ పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొడంగల్, దౌల్తాబాద్ మండలాల ఎంఈవోలు రాంరెడ్డి, వెంకటస్వామి హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, పెద్దనందిగామ ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాజరత్నం, పాఠశాల హెచ్‌ఎం ఇల్లూరి క్రాంతి కుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

నేడు బషీరాబాద్‌కు ఎమ్మెల్యే రాక

బషీరాబాద్: మండల పరిషత్ కార్యాలయానికి నేడు(శుక్రవారం) ఎమ్మెల్యే రానున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, 12 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కాశీంపూర్ గ్రామస్తులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నిర్వహించే అవగాహన సదస్సులో పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్, 2గంటలకు ఉపాధి హామీ పనులపై జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు.

నేడు ఉపాధిహామీ పనులపై ప్రజా వేదిక

బషీరాబాద్: స్థానిక ఉపాధిహామీ కార్యాలయం వద్ద నేడు(శుక్రవారం) ఉపాధి పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రజావేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. 2023-2024 సంవత్సరంలో రూ.4కోట్ల 68లక్షల 43వేల 903 వ్యయంతో చేసిన పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మూడుచింతలపల్లి: కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదువుకుని 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విజయ్‌కుమార్ సూచించారు. క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక అవసరమన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నెమరువేసుకుంటునే ఉపాధ్యాయులు చెప్పిన మెలకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సభ్యులు, దాత నాగేశ్, సిబ్బంది, ఉపాధ్యాయులు, వాద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కొడంగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తాగునీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు అనిత, శ్రీనివాస్, ఆర్ఐ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఘట్‌కేసర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘట్‌కేసర్‌లోని యూనియన్ బ్యాంకు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకులోని మహిళా ఉద్యోగినులు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వివేక్‌కుమార్, క్రిసోలైట్, తిపర్ణ పాల్గొన్నారు.

13వ తేదీన తైబజార్ వేలం

కీసర రూరల్: ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించిన తైబజార్ వసూలు హక్కులు పొందేందుకు ఈనెల 13న వేలం నిర్వహిస్తున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మున్సిపల్ కమిషనర్ నాగారం పేర రూ.2లక్షల డీడీని తీసి అదేరోజు ఉదయం 11.30గంటల్లోగా మున్సిపల్ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సూచించారు.